సాక్షి SAKSHI TELUGU DAILY Fri, 10 June 2016
epaper.sakshi.com/c/10895302

### సీపీసీఆర్ఐ ప్రాంతీయ కార్యాలయం కోసం

# భూమి పరిశీలన

**మాధవరాయుడుపాలెం, వేమగిరి ప్రాంతాల్లో పర్యటించిన డైరెక్టర్ డాక్టర్ చౌడప్ప**

**అమలాపురం / కడియం :** రాష్ట్రంలో సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీసీ ఆర్ఐ) ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు దిశగా ముందడుగు పడింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలో భూమి ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్)కు లేఖ రాసింది. ఐసీఏఆర్ సిఫార్సు మేరకు సీపీసీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ చౌడప్ప, సీపీసీఆర్ఐ కాసరఘోడ్ శాస్త్రవేత్త నిహాల్ తదితరులు గురువారం కడియం మండలం మాధవరాయుడుపాలెం, వేమగిరి ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. మాధవరాయుడుపాలెంలో 94 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, దీనిలో 50 ఎకరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇక్కడ భూమిని చూసి చౌడప్ప సంతృప్తి వ్యక్తం చేశారు. భూమికి ఇరువైపులా ప్రధాన రహదారి ఉండడం, భూమి సారవంతంగా ఉండడంతోపాటు భూగర్భ నీటి లభ్యత పుష్కలంగా ఉండడం, చెంతనే గోదావరి డెల్టా కాలువ ఉండడంతో అన్నివిధాలా



**మాధవరాయుడుపాలెంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీసీఆర్ఐ డైరెక్టర్ చౌడప్ప తదితరులు**

యోగ్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. చౌడప్ప ఇచ్చే నివేదిక మేరకు సీపీసీఆర్ఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు ఐసీఏఆర్ అనుమతి ఇవ్వనుంది. అన్నీ సానుకూలమైతే మాధవరాయుడుపాలెంలోనే సీపీసీ ఆర్ఐ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. భూమి పరిశీలన అనంతరం చౌడప్ప మాట్లాడుతూ సీపీసీఆర్ఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేస్తే రాష్ట్రంలో కొబ్బరి సాగుకు ఊతమిచ్చినట్టవుతుందన్నారు. పొట్టిరకాల పెంపకం, విలువ ఆధారిత కొబ్బరి ఉత్పత్తుల తయారీ, కొబ్బరిలో అంతర పంటల సాగుకు ప్రోత్సాహం, రైతుకు సాంకేతికత బదిలీ వంటి అంశాలు సీపీసీఆర్ఐ ప్రాధాన్యతలన్నారు.